క్లుప్తంగా

చంద్రశేఖర్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం పరిశోధకుడు పి.చంద్రశేఖర్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. యాన అప్రైజల్ ఆఫ్ కో ఆపరేటివ్స్‌విస్ ఏవిస్ రూరల్ డెవలప్‌మెంట్ ఎ స్టడీ ఇన్ సెలెక్ట్ డిస్ట్రిక్ట్ ఆఫ్ తెలంగాణా అనే సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినందుకు చంద్రశేఖర్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్ నర్సింహాచారి తెలిపారు. ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు ఎండీ. ఇక్బాల్ అలీ పర్యవేక్షణలో చంద్రశేఖర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

నేడు జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో వైద్యశిబిరం

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఆస్పత్రి ఆ. ద్వర్యంలో జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో బుధవారం వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మంగళవారం కాజీపేట రైల్వే ఆస్పత్రి సీనియర్ ఎం.ఎస్ డాక్టర్ ఐ.నిరంజన్‌రావు తెలిపారు. జమ్మికుంటలోని రిటైర్డ్ రైల్వే ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు, ఎంప్లాయీస్‌కు హెల్త్‌క్యాంప్‌లో ఈసీజీ, బీపీ, బ్లడ్ టెస్ట్ తదితర వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హసన్‌పర్తి : చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి ఉదయం 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కోమటిపల్లి, భద్రకాళినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

గ్రూప్-2 ఆన్‌లైన్ టెస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్ : గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గ్రాండ్ టెస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 8, 9, 15, 16, 22, 23, 30, 31వ తేదీల్లో నిర్వహించనున్న టెస్ట్‌కు ఆన్‌లైన్‌లో tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో జూలై 5లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉచిత శిక్షణకు..

సివిల్ సర్వీస్-25 పోటీపరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అందజేస్తున్న ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవీ.ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు జూలై 3 లోపు ఆన్‌లైన్‌లో tgbcstudycircle. cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీలతకు సన్మానం



హన్మకొండ: టీజీ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలతను అద్దె బస్సుల యజమానులు మంగళవారం సన్మానించారు. శ్రీలత రంగారెడ్డి రీజియన్‌కు బదిలీ కాగా మంగళవారం రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, జ్ఞాపిక అందించి సన్మానించారు. ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్బ మధుకర్‌రెడ్డి, రీజినల్ అధ్యక్షుడు మారెపల్లి రాంరెడ్డి, సభ్యులు బి.లింగారెడ్డి, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

బీమా డబ్బులు అందజేత



మామునూరు: ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురంలో శ్రీజనచైతన్య పురుషుల పొదుపు సంఘం సభ్యులు బండి కొమురయ్య, మేకల నారాయణ ఇటీవల మృతి చెందారు. బాధితుల కుటుంబాలకు మంగళవారం శ్రీజన చైతన్య పురుషుల సంఘ కార్యవర్గ ప్రతినిధులు పరామర్శించి ఒక్కొక్కరికి రూ.70వేల చొప్పున ఇద్దరికి బీమా సొమ్మును అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మాచర్ల రంజిత్‌కుమార్, ప్రతాపరుద్ర పురుషుల పొదుపు సమితి కొండపర్తి అధ్యక్షుడు మందల సుదర్శన్‌రెడ్డి, బండి శ్యామ్, బోగవల్లి మధుకర్ రావు, మేకల సూరయ్య, ముల్కలపల్లి విజేందర్, మాచర్ల శ్రీనివాస్, ఇల్లందల వెంకటస్వామి, లక్క రమేష్, కాయిత యాకయ్య, ఇల్లందుల దేవేందర్, సట్ల బిక్షపతి, చెక్క సుమన్, గణకులు కొలిపు రాము పాల్గొన్నారు.

మనసున్న మారాజు

- వేతనంలో కొంత సమాజ సేవకు
- ఆదర్శంగా నిలుస్తున్న హోంగార్డు కృపాకర్
- మూడుసార్లు ఉత్తమ హోంగార్డుగా ప్రశంసలు



యాచకులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న కృపాకర్ (ఫైల్)



అప్పటి కలెక్టర్ కరుణ, సీపీ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకుంటున్న కృపాకర్ (ఫైల్)

హన్మకొండ చౌరస్తా : ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని చెప్పిన మథర్ థెరిస్సా వ్యాఖ్యలను నిజం చేస్తున్నాడు ఓ హోంగార్డు. తనకు వచ్చే కొంతవేతనం నుంచి పేదల ఆకలి తీర్చుతూ మనసున్న మారాజు అనిపించుకున్నాడు. చాలీచాలని సంపాదనతో ఇల్లు గడవడమే కష్టంగా మారుతున్న నేటి రోజుల్లో ఓ హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ తన వేతనం నుంచి కొంత మొత్తాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నాడు. హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న నల్ల కృపాకర్ గురించి 'సాక్షి' ప్రత్యేక కథనం...

ఉద్యోగం చిన్నది. అయితేనేం పలువురికి సాయం చేయాలన్న మనసున్న వ్యక్తిగా అనిపించుకుంటున్నాడు. వృత్తిపై నిబద్ధత కనబరుస్తూనే తనస్థాయిలో సేవా కార్యక్రమాలు చేస్తూ ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల నుంచి ప్రశంసలు అందుకున్నాడు. హనుమకొండలోని వడ్డేపల్లికి చెందిన నల్లా కృపాకర్ పేద దళిత కుటుంబంలో జన్మించాడు. పేదరికంతో ఉన్నత చదువులు చదవలేక ఇంటర్ విద్యను మధ్యలోనే వదిలేశాడు. పోలీస్‌శాఖలో పనిచేయాలన్న తపన, పట్టుదలతో 2003లో హోంగార్డుగా విధుల్లో చేరాడు. సంగెం, మిల్స్‌కాలనీ, సుబేదారి మహిళా పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించాడు. హోంగార్డుగా వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తూ నలుగురికి సాయం చేస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు. వృత్తిరీత్యా రోజులో ఎక్కువ సమయం రోడ్డు పైనే ఉంటూ ఎంతో మందిని గమనిస్తూ ఉంటాడు. తినడానికి డబ్బులు లేనివారు కొందరైతే , రోడ్డు దాటేందుకు శరీరం సహకరించని వృద్ధులు, మతిస్థిమితం కోల్పోయి రోడ్లపై సంచరించే వారు మరికొందరు. తనకు కనిపించిన వారికి తనవంతుగా సాయం చేయడం కృపాకర్ దినచర్యలో భాగమైంది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్నాక్స్, వృద్ధులకు టిఫిన్లు, భోజనం అంది స్తుంటాడు. వి ధుల పట్ల నిబ ద్ధత, సేవా కార్యక్రమాలను గు ర్తించిన ఉన్నతా ధికారులు మూ డు పర్యాయాలు ఉ త్తమ హోంగార్డుగా ప్రశంసపత్రాల ను అందజేసి అభినందించారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం



బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవంలో జర్నలిస్టు యూనియన్ నాయకులు

- టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి
- ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వృత్తిరీత్యా మానసిక ఒత్తిడితో సతమతమవుతున్న జర్నలిస్టులు క్రీడల్లో పాల్గొనడం వలన ఒత్తిడిని అధిగమించవచ్చని టీయూడబ్ల్యూజే ఐజేయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా మంగళవారం హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. పోటీలను టీయూడబ్ల్యూజే ఐజేయూ హనుమకొండ కార్యదర్శి తోట సుధాకర్‌తో కలిసి రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తితో పాటు జర్నలిస్టులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ప్రతి రోజు వ్యాయామం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో అతిథులను మెమోంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే 143 హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మస్కపురి సుధాకర్, సుభాష్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, డీఎస్‌ఏ షటిల్ బ్యాడ్మింటన్ కోచ్ కూరపాటి రమేష్,ప్రెస్‌క్లబ్ బ్యాడ్మింటన్ నిర్వహణ కమిటీ బాధ్యులు విష్ణు, రాజేష్, సుధాకర్, రాజు, బాధ్యులు శ్యాం, శ్రీను, వ రప్రసాద్, హరీష్, దిలీప్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీజీఓ నాయకులు



కలెక్టర్ ప్రావీణ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీజీఓ నాయకులు

హన్మకొండ అర్బన్ : హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పి.ప్రావీణ్యను మంగళవారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, టీఎన్జీఓస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి ఉద్యోగస్తులందరూ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీజీఓ నాయకులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఈగ వెంకటేశ్వర్లు, అన్వర్ హుస్సేన్, డాక్టర్ మహేష్‌కుమార్, రాజేష్‌కుమార్ గౌడ్, ఆస్నాల శ్రీనివాస్, నారాయణ, రమేష్‌కుమార్‌రెడ్డి, టీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కేంద్ర సంఘ నేతలు శ్యాంసుందర్, మోయిజ్, లక్ష్మీప్రసాద్, రాజమౌళి, సలీం, సురేష్, రాజేష్ ఖన్నా, రాంప్రసాద్, రాజమణి, భగవాన్‌రెడ్డి, రఘుపతిరెడ్డి ఉన్నారు.

సన్మానించిన రెడ్‌క్రాస్ పాలకవర్గం



కలెక్టర్‌కు బ్లాంకెట్స్ అందజేస్తున్న రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యులు

హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు పి.ప్రావీణ్యను మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, బ్లాంకెట్స్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ కార్యక్రమాల గురించి వివరించి సొసైటీ సందర్శించడానికి ఆహ్వానించారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ విజయచందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వీ శ్రీనివా స్‌రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కార్పొరేటర్

మడికొండ: హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ ప్రావీణ్యను మంగళవారం క్యాంప్ కార్యాలయంలో 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళినట్లు చెప్పారు. కలిసిన వారిలో బొల్లికొండ వినోద్, కొలిపాక కుమార్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాల్లో పన్నులు చెల్లించాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీవాకడే

వరంగల్ అర్బన్: బల్దియా వ్యాప్తంగా ఉన్న అన్ని మీసేవ కేంద్రాల్లో నగదు, డిజిటల్ రూపంలో పన్నులు చెల్లించాలని కమిషనర్ అశ్విని తానాజీవాకడే సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, డిప్యూటీ కమిషనర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడా రు. 66 డివిజన్ల వ్యాప్తంగా ఉన్న గృహాల యజమానులకు పన్నుల చెల్లింపులకు సంబంధించిన డి మాండ్ నోటీసులు అందజేయాలని ఆదేశించారు. సాంకేతిక కారణాలతో ఇటీవల మీసేవ కేంద్రాల్లో నిలిచిపోయిన పన్నులు చెల్లింపు ప్రక్రియను పునరుద్ధరించినట్లు తెలిపారు. జూలై 1 నుంచి యథావిధిగా 12 మీసేవ కేంద్రాలతోపాటు వార్డు ఆఫీసర్ కార్యాలయాల్లో కూడా పన్నులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. బల్దియా షాపుల లీజులకు సంబంధించిన దస్త్రాన్ని తనకు పంపించాలని, ప్రత్యేక దృష్టి సారించి నీటిపన్నులు చెల్లించేలా ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, ఆర్వోలు సుదర్శన్, యుసోఫొద్దీన్, షహజాదీబేగం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన రేణుకా ఎల్లమ్మతల్లి కల్యాణం

కాజీపేట: మండలంలోని సోమిడి గ్రామశివారులో కొలువుదీరిన రేణుకా ఎల్లమ్మ తల్లి, కంఠమహేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. జమదగ్ని మహాముని, రేణుకా ఎల్ల మ్మ తల్లి కల్యాణ వేడుకలను ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు శంకర్‌శర్మ వైభవంగా జరిపించారు. కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ దంపతులు, గౌడ సంఘం అధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బొల్లికొండ యాదగిరి, ఉపేందర్, కాటపురం రాజు, బొల్లి కొండ వెంకటేష్, బుర్ర బాబురావు, సాంబయ్య, బుర్ర శ్రీనివాస్ హాజరై పూజలు నిర్వహించారు.

విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి

గీసుకొండ : విద్యుదాఘాతానికి గురై మతి స్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్‌లోని జాన్‌పాక వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 35-40 ఏళ్ల వ్యక్తి ఒంటిపై బట్టలు లేకుండా పిచ్చిగా ప్రవర్తిస్తూ జాన్‌పాకలోని కావ్య పాలిమర్స్ పైపుల తయారీ కంపెనీలో తిరుగుతూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కన గోడ ఎక్కి చేతులు పైకి లేపడంతో తీగలు తగలడంతో మృతి చెందాడు. కంపెనీ యజమాని గవాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. మృతుడిని గుర్తు పడితే 8712685250, 8712685240 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స్కేటింగ్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సిద్ధార్థ



వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ రోలార్ స్కేటింగ్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వరంగల్ నగరంలోని ఓసిటీకి చెందిన బండి సిద్ధార్థ ఎన్నికయ్యాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం అనంతరం జరిగిన ఎన్నికల్లో సిద్ధార్థ జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు రాష్ట్ర చైర్మన్ ఎస్.మదన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దాదాపు దశాబ్దం కాలానికి పైగా హనుమకొండ బాలసముద్రంలోని చిల్డ్రన్స్ పార్కులో సిద్ధార్థ అనేక మంది పిల్లలకు స్కేటింగ్ లో శిక్షణ అందించాడు. తన ఎన్నికకు సహకరించిన అసోసియేషన్ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ మాచర్ల రాజగోపాల్, జనరల్ సెక్రటరీ ఎంపీ రామకృష్ణ, కార్యవర్గానికి సిద్ధార్థ కృతజ్ఞతలు తెలిపారు.

బస్టాండ్‌లో మృతదేహం లభ్యం



రామన్నపేట : వరంగల్ బస్టాండ్ ఆవరణలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఇంతేజార్‌గంజ్ సీఐ శివకుమార్ తెలిపారు. చనిపోయిన వ్యక్తి ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తి అని, ఇతని పేరు ఓగి అని అంటున్నారని తెలిపారు. ఇతని వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల వరకు ఉంటుందని పేర్కొన్నారు. వారం క్రితం ఎల్‌బీనగర్‌లోని ఓ బిల్డింగ్ దగ్గర పనిచేస్తూ వచ్చిన డబ్బులతో మద్యం సేవించేవాడన్నారు. ప్రతిరోజు పనికి సక్రమంగా రాకపోవడంతో అక్కడి నుంచి వెళ్లగొట్టారని, ఎవరికైనా ఇతని గురించి తెలిస్తే ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో 87126 85118 నంబర్‌లో సంప్రదించాలని సీఐ వివరించారు.

దాతల సహకారం మరువలేనిది



ఐనవోలు : పేద విద్యార్థుల చదువుకు సహకరిస్తున్న దాతల సహకారం మరువలేనిదని కక్కిరాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆర్ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం పాఠశాలలో దాతలు అందించిన నోట్ బుక్స్, ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, కలర్ పెన్సిళ్లు, షార్ప్‌నర్, ఎరేజర్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. అడగగానే దాతలు మెట్టు తిరుపతిరెడ్డి, ఆత్మకూరు శ్రీనివాస్, శనిగరం సాంబయ్య, బొలుగొద్దు శ్రీధర్ ముందుకొచ్చి సుమారు రూ. 25వేల విలువచేసే స్టేషనరీని అందించినట్లు తెలిపారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ, ఏఏపీసీ చైర్మన్ స్వర్ణలత, హెచ్‌ఎం రామకృష్ణ, పాల్గొన్నారు.

బావుల చుట్టూ ప్రహరీ నిర్మించుకోవాలి

- కాజీపేట ఏసీపీ తిరుమల్
- ప్రమాదకర బావుల పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న ఏసీపీ తిరుమల్

హసన్‌పర్తి: రోడ్డుకిరువైపులా ప్రమాదరకంగా ఉన్న బావుల చుట్టూ ప్రహరీ నిర్మించుకోవాలని కాజీపేట ఏసీపీ తిరుమల్ సూచించారు. హసన్‌పర్తి మండలంలోని గంటూరుపల్లి పాఠశాల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావిని ఆయన పరిశీలించారు. ఇప్పటికీ వాహనచోదకులు అదుపు తప్పి బావిలో పడి ఆస్పత్రిలో చేరారని స్థానికులు ఏసీపీకి వివరించారు. బావిని పూడ్చాలని ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. రెండేళ్లుగా ఈ సమస్య ఇలాగే కొనసాగుతోందని స్థానికులు ఏసీపీకి వివరించారు. అనంతరం ఏసీపీ తిరుమల్ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా మారిన వ్యవసాయ బావులను గుర్తించాలని ఆదేశించారు. పట్టాదారులతోనే బావిచుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయించాలని సూచించారు. ఒక వేళ అవసరం ఉంటే ఆ బావిని పూడ్చాలని ఆదేశించారు. పట్టాదారుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అక్కడ ఏదైనా ప్రమాదం జరిగినట్లయితే పట్టాదారుడిని బాధ్యుడిగా చేస్తామన్నారు. అతడిపై కేసు నమోదు చేస్తానని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ ఇన్‌స్పెక్టర్ జవ్వాజీ సురేష్ తదితరులు ఉన్నారు.

మహిళలకు అండగా సఖి సేవలు



సఖి సేవల గురించి వివరిస్తున్న లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ వినీల

హన్మకొండ అర్బన్ : ఆపదలో ఉన్న మహిళలకు అండగా నిలిచేందుకు సఖి సేవలందిస్తుందని, వీటిని మహిళలు సద్వినియోంగం చేసుకోవాలని సఖి వన్‌స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సిలర్ ఎ.శ్రీదేవి, కేస్ వర్కర్ వినీల అన్నారు. మంగళవారం బాలసముద్రంలో ఆర్‌పీ శ్రీలత అధ్వర్యంలో మహిళలకు సఖి కేంద్రం సేవల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడుతూ సఖి కేంద్రం ద్వారా మహిళలకు అందిస్తున్న వైద్య, కౌన్సిలింగ్, న్యాయ, పోలీస్ సహాయం , తాత్కాలిక వసతి సేవల గురించి వివరించారు. అత్యవసర సమయంలో సాయం పొందేందుకు 181 మహిళా హెల్ప్‌లైన్, 1098 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రామతార, మహిళలు, సఖి సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతిలేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



డీఈఓ అబ్దుల్‌హైకి వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

విద్యారణ్యపురి : ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా అనుమతిలేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్, జిల్లాకార్యదర్శి డి.తిరుపతి మంగళవారం డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైకి విన్నవించి వినతిపత్రం అందజేశారు. హనుమకొండ నగరంలో హంగు ఆర్భాటాలతో తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవటంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆరోపించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే కిడ్స్ ప్లే స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు.అనుమతిలేని వాటిపై చర్యలు తీసుకోవాలని డీఈఓకు సమర్పించిన వినతిలో పేర్కొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



సన్మానం పొందిన లక్ష్మీనారాయణతో కమాండెంట్

హసన్‌పర్తి: రాష్ట్రస్థాయి ఉత్తమ సేవాఅవార్డు అందుకున్న వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషియన్ ప్రతినిధి దేశిని లక్ష్మీనారాయణను మంగళవారం ఘనంగా సన్మానించారు. సీఆర్‌పీఎఫ్-58 బెటాలియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి సీఆర్‌ఎఫ్ బెటాలియన్ కమాండెంట్ మోహన్ మాట్లాడుతూ లక్ష్మీనారాయణ చేపడుతున్న సేవలను కొనియాడారు. డిప్యూటీ కమాండెంట్లు సుమ, తులసీ, లిత్‌అగర్వాల్, హిమ పాల్గొన్నారు.

ఉద్యోగులు తమ కర్తవ్యాన్ని నెరవేర్చాలి



కలెక్టర్ సత్యశారదాదేవికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీఓస్ నాయకులు

కాశీబుగ్గ సెంటర్ : ఉద్యోగులు తమ కర్తవ్యాన్ని నెరవేరుస్తూ జిల్లాను ముందుకు తీసుకెళ్లాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టే కార్యక్రమాలను ప్రజలకు అందించేందుకు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి అన్నారు. జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సత్య శారదాదేవిని వరంగల్ జిల్లా టీఎన్జీఓస్ యూనియన్ అధ్యక్షుడు గజ్జల రామ్‌కిషన్, కార్యదర్శి వేణుగోపాల్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, టీఎన్జీఓస్ జిల్లా కోశాధికారి పాలకుర్తి సదా నందం, సహఅధ్యక్షులు హేమానాయక్, ఉపాధ్యక్షులు రాజు, దుర్గారావు, ఇంద్రసేనారెడ్డి, సహా య కార్యదర్శులు రమాదేవి, రామకృష్ణ, వంశీ, నాయకులు రాజేష్, సత్యనారాయణ, యూసఫ్, సునీత నాయర్, మధుచంద్ర, కిరణ్‌కుమార్ ఉన్నారు.

నేటి నుంచి దర్గా రైల్వే గేట్ మూసివేత



కాజీపేట రూరల్ : కాజీపేట-వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న దర్గా రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్ నంబర్ 60ను వారం రోజుల పాటు మూసివేస్తున్నట్లు మంగళవారం రాత్రి రైల్వే అధికారులు తెలిపారు. మూడో రైల్వే లైన్ నిర్మాణ పనుల నేపథ్యంలో దర్గా రైల్వే గేట్‌ను ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు వారం రోజుల పాటు మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దర్గా రైల్వే గేట్‌లో నుంచి వివిధ మార్గాలకు ప్రయాణించే ప్రజలు, వాహనదారులు ఆయా తేదీల్లో వేరే మార్గం గుండా రాకపోకలు సాగించి రైల్వే అధికారులకు సహకరించాలని కోరారు.

ఉన్మాదికి ఉరిశిక్ష విధించాలి

ఖిలా వరంగల్ : పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌బాద్ మండలం కాటేపల్లిలో ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన ఉన్మాదికి వెంటనే ఉరిశిక్ష విధించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. మంగళవారం నగరంలోని 39వ డివిజన్ సాకరాశికుంట మహారాజ్ కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో హనుమకొండ రెడ్డి కాలనీలో 9 నెలల పసిగుడ్డుపై అత్యాచారం హత్య, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకో వాలని, హత్య చేసిన నిందితున్ని పోక్సో చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోలపాక మార్టిన్ లూథర్, జనార్ధన్, జిలకర వీరస్వామి, సుదర్శన్, నవీన్, వీరస్వామి పాల్గొన్నారు.